క్లుప్తంగా

ఎమ్మెల్యే హరీశ్‌రావు సంక్రాంతి శుభాకాంక్షలు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా ప్రజలకు సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంక్రాంతి ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన కాంతిని తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరారు.

చదువుతో పాటు క్రీడలు ముఖ్యమే..



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ మాణిక్యరెడ్డి

చిన్నకోడూరు(సిద్దిపేట): చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమేనని ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి అన్నారు. మండల పరిధిలోని రామునిపట్లలో జెర్రిపోతుల రంగయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు లక్ష్మణ్ నిర్వహిస్తున్న మండలస్థాయి క్రికెట్ టోర్నీని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో ఆరోగ్యంతో పాటు ఆలోచనశక్తి మెరుగుపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

బెజ్జంకి(సిద్దిపేట): అండర్-19 సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి జట్టుకు మండలంలోని వడ్లూరు బేగంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన అక్షిత, సాయిచరణ్ ఎంపికైనట్లు పీఈటీ సతీష్ తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు నుంచి బాలుర విభాగంలో ప్రథమ స్థానం, బాలికల విభాగంలో 3వ స్థానం సాధించినట్లు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను అభినందించారు.

ఘనంగా మల్లన్న జాతర



మల్లన్న స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

తొగుట(దుబ్బాక): మండలంలోని జప్తిలింగారెడ్డిపల్లి సింగరాల మల్లన్న జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఒగ్గు కళాకారులు ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరకు వివిధ మండలాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్నిరకాల ఏర్పాట్లు చేసినట్టు సర్పంచ్ చిలువేరి జ్యోతి తెలిపారు. సాయంత్రం గ్రామస్తులు బోనాలు, ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల ఊరేగింపు నిర్వహించారు.

ఆటో డ్రైవర్లు అధైర్యపడొద్దు



మాట్లాడుతున్న అత్తు ఇమామ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆటో డ్రైవర్లకు న్యాయం జరుగుతుందని.. అధైర్యపడొద్దని సిద్దిపేట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ అన్నారు. ఆదివారం సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆటోడ్రైవర్ల మనోస్థైర్యం దెబ్బతీయడం సరికాదన్నారు. ఈ విషయంపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆటో కార్మికులకు న్యాయం చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి మధు, పట్టణ యువజన అధ్యక్షుడు ఖయాజుద్దీన్, నవాజ్, ఫయాజ్, మహేష్, దోసపల్లి అనిల్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్ల చోరీ

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్‌లో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వ్యవసాయ బావుల వద్ద బోరు మోటార్లను చోరీ చేశారు. గ్రామంలోని పెద్ద చెరువు ఆయకట్టు ద్వార సాగు చేసుకుంటున్న రైతుల 5 హెచ్‌పీ బోరు మోటార్లును చోరీకి గురయ్యాయి. ఈవిషయమై ఆదివారం బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిర్మాణ పనులు పూర్తి చేయాలి

చేర్యాల(సిద్దిపేట): సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి రైతులకు విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మండల కార్యదర్శి కత్తుల భాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కడవేర్గులో నిర్మాణంలో ఉన్న సబ్‌స్టేషన్‌ను పరిశీలించి మాట్లాడారు. రూ. కోట్లతో నిర్మిస్తున్న సబ్‌స్టేషన్ పనులు రెండేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు.



కల్యాణ మహోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



హుస్నాబాద్: శ్రీకృష్ణ దేవాలయంలో కల్యాణ మహోత్సవం

కమనీయం.. రమణీయం

వైభవంగా గోదారంగనాథస్వామి కల్యాణం

ధనుర్మాసోత్సవాల్లో భాగంగా జిల్లాలోని పలు ఆలయాల్లో ఆదివారం గోదాదేవీ రంగనాథుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేడుకలను తిలకించేందు భక్తులు భారీగా తరలివచ్చారు. శాస్త్రోక్తంగా ఎదుర్కోలు, స్వామివారికి యజ్ఞోపవిత ధారణ, జీలకర్ర, బెల్లం, ముత్యాల తలంబ్రాలు తదితర కల్యాణ తంతును అర్చకులు కనుల పండువగా నిర్వహించారు. మహిళలు గోదాదేవికి ఒడి బియ్యం, కానుకలు సమర్పించారు.

- సాక్షి నెట్‌వర్క్



బెజ్జంకి: లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో..



హుస్నాబాద్: నృత్యం చేస్తున్న యువతులు



చేర్యాల(సిద్దిపేట): వేణుగోపాలస్వామి ఆలయంలో..



హుస్నాబాద్ రూరల్: పొట్లపల్లి సీతారామచంద్రస్వామి ఆలయంలో..

అయోధ్య అక్షింతల పంపిణీ



మల్లారంలో అక్షింతలతో భక్తుల శోభాయాత్ర



ఖానాపూర్‌లో..



పాతూరులో..

చిన్నకోడూరు(సిద్దిపేట)/నంగునూరు/గజ్వేల్‌రూరల్/మర్కూక్: అయోధ్య రాములోరి పూజిత అక్షింతలను ఆదివారం చిన్నకోడూరు మండల పరిధిలోని మల్లారం, సికింద్లాపూర్ గ్రామాల్లో ఇంటింటా పంపిణీ చేశారు. శ్రీరామ సంకీర్తన, ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రతినిధులు, రామభక్తులు పాల్గొన్నారు. అలాగే నంగునూరు మండలంలోని ఖానాపూర్, వెంకటాపూర్‌లో ఇంటింటా తిరుగుతూ పంపిణీ చేశారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఎస్టీ వీధి, జాలిగామ బైపాస్ రోడ్డులో రామ జన్మభూమి మందిర నిర్మాణ ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు ఆకుల నరేష్‌బాబు ఆధ్వర్యంలో అక్షింతలు పంపిణీ చేశారు. మర్కూక్ మండలంలోని పాతూరులో సర్పంచ్ అరుణ నర్సింలు ఆధ్వర్యంలో అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు.

పతంగుల పంపిణీ



పతంగులను పంపిణీ చేస్తున్న ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సంక్రాంతి సందర్భంగా ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఆదివారం సిద్దిపేట పట్టణంలో చిన్నారులకు పతంగులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా టీపీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కో-ఆర్డినేటర్ దాసరి రాజు మాట్లాడుతూ.. చిన్నారులు పతంగులు ఎగరవేసే సమయంలో పెద్దలు గమనించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి కొండలవాడి సతీష్, ఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు బడికోల్ రాకేష్ యాదవ్, నాయకులు తరుణ్ గౌడ్, మొగిలి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



నంగునూరు: బహుమతులతో మహిళలు



హుస్నాబాద్‌రూరల్: బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

హుస్నాబాద్‌రూరల్/అక్కన్నపేట/నంగునూరు(సిద్దిపేట)/చిన్నకోడూరు: భోగి పండుగను పురస్కరించుకొని ఆదివారం జిల్లావ్యాప్తంగా పలు గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. హుస్నాబాద్ మండలం పందిల్లలో ఎస్సై మహేశ్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ మహిళల కళలను వెలికి తీసేందుకు ముగ్గుల పోటీలు దోహదపడుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అక్కన్నపేట మండల కేంద్రం పరిధిలోని చౌడుతండా, బోదర్‌వాగుతండా, మంజ్యానాయక్ తండాల్లో కాంగ్రెస్ గిరిజన నేత ధరావత్ రోజా-తిరుపతినాయక్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు. నంగునూరు మండలం గట్లమల్యాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలో గెలుపొందిన మహిళలకు ఆయిల్ పామ్ ఫార్మర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి సౌజన్యంతో వెండి కాయిన్స్, స్టీల్ బాక్స్‌లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేశ్, తదితరులు పాల్గొన్నారు. చిన్నకోడూరు మండల పరిధిలోని చౌడారం, రామునిపట్ల గ్రామాల్లో నిర్వహించిన ముగ్గుల పోటీలు అలరించాయి. సర్పంచ్‌లు అనిత బాలయ్య, శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

గజ్వేల్‌రూరల్: గజ్వేల్- ప్రజ్ఞాపూర్ పద్మశాలి సంఘం నాయకుడు తలకొక్కుల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం 2024 నూతన సంవత్సర క్యాలెండ్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షుడు తలకొక్కుల ప్రేమ్ కుమార్, గౌరవ అధ్యక్షుడు స్వర్గం రాజేశం, సీనియర్ అడ్వకేట్ గుండు కాశీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నిక ఏకగ్రీవం

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని దుద్దెడలోని ఆదర్శ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం ఏకగ్రీవం అయ్యాయి. అధ్యక్షుడిగా మిద్దె రమేష్, ఉపాధ్యక్షులుగా పంజాల శ్రీనివాస్, కోశాధికారిగా మిద్దె శివకుమార్, కార్యవర్గ సభ్యులుగా పలువురు ఎన్నికయ్యారు.

కేఎఫ్‌ఏ నూతన కార్యవర్గం

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని కొండాపూర్‌లో కేఎఫ్‌ఏ (కొండాపూర్ ఎంప్లాయిస్ అసోసియేషన్) నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎర్రోల్ల బాల్‌రాజు, అధ్యక్షుడిగా మొయ్య బాలయ్య, ఉపాధ్యక్షుడిగా వేముల భూపాల్, ప్రధాన కార్యదర్శిగా జిగిరి కొమురయ్య, కోషాధికారిగా కొండ కనకరాజు, ప్రధాన సలహాదారుడిగా శ్రీరామ్ జ్ఞానేశ్వర్, కార్యవర్గ సభ్యులుగా పలువురు ఎన్నికయ్యారు.

సన్మానం



సీతారాముల ఫొటోను అందజేస్తున్న రామకోటి రామరాజు

గజ్వేల్‌రూరల్: అయోధ్యలో రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ శుభ సందర్భంగా గజ్వేల్ పట్టణానికి చెందిన వల్లాల ప్రవీణ్ ఆదివారం పాదయాత్రగా గజ్వేల్ రామాలయం నుంచి వేములవాడ ఆలయానికి బయలుదేరాడు. రామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపి ప్రవీణ్‌కు కాషాయ జెండాను అందించారు. సీతారాముల ఫొటోతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రామకోటి రామరాజు, ఆలయ అర్చకులు బిటుకూరి శ్రీనివాస్, మఠం శివకుమార్, దేశపతి శంకర్ శర్మ, వెనవెల్లి సతీష్, ఆయిల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

సిద్దిపేటఅర్బన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి, అప్పుల బాధ భరించలేక పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన మరో వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. సిద్దిపేట త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్సాన్‌పల్లికి చెందిన పండుగ రాజు (33) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈనెల 4వ తేదీన సాయంత్రం కొండపాక మండలం మర్పడగ రైస్ మిల్‌కు తన మోపెడ్‌పై వెళ్తుండగా పొన్నాల శివారులోని రైస్ మిల్ వద్ద అదుపుతప్పి కింద పడగా తలకు, చేతికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసిన అనంతరం వైద్యుల సూచన మేరకు గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. అలాగే మిట్టపల్లి గ్రామానికి చెందిన సంపంగి పర్శరాములు (27) కూలీ పనులు చేసుకునేవాడు. అప్పులు ఎక్కువ కావడంతో బాధ భరించలేక ఈనెల 6న గ్రామంలోని బొందలగడ్డ వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయాన్ని తన తమ్ముడు రాజుకు ఫోన్ చేసి చెప్పగా మరో వ్యక్తితో కలిసి అక్కడికి చేరుకొని 108లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈక్రమంలో ఆరోగ్యం విషమించి ఆదివారం మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ దుబ్బాక మజీద్ కమిటీ ఎన్నిక

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట- భూంపల్లి మండలకేంద్రంలో దుబ్బాక నియోజకవర్గ మజీద్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. నూతన అధ్యక్షుడిగా ఎండీ. మౌలానొద్దీన్, ప్రధాన కార్యదర్శిగా అల్తాఫ్ హుస్సేన్, గౌరవ అధ్యక్షుడిగా ఎండీ. జాకీర్ హుస్సేన్, ఉపాధ్యక్షులుగా యూసుఫ్, షకీల్ అహ్మద్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు.



◆ దప్పుల పంపిణీ



మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని రేబర్తిలో సంక్రాంతి సందర్భంగా జక్కిరెడ్డి సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలో దప్పులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ కామెడి జీవన్‌రెడ్డి, ఊట్ల శ్రీధర్‌రెడ్డి, మఠం భద్రయ్య, కొమురవెల్లి దేవస్థానం డైరెక్టర్ బచ్చల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

◆ క్రీడలతో మానసికోల్లాసం



దౌల్తాబాద్(దుబ్బాక): క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దొమ్మాట మాజీ సర్పంచ్ మోహన్‌రావు, మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు నర్ర రాజేందర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని దొమ్మాటలో మోహన్‌రావు ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు సల్లా స్వామి, క్రీడాకారులు పాల్గొన్నారు.

◆ కబడ్డీ, వాల్‌బాల్ పోటీలు ప్రారంభం

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్ నిర్వహించగా మద్దూరు జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు.

◆ ఫిట్స్‌తో వ్యక్తి మృతి

కొమురవెల్లి(సిద్దిపేట): ఫిట్స్‌తో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలోని పాతకమాన్ వద్ద గల జ్యోతిర్గం ఆశ్రమంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయపోల్ మండల కేంద్రానికి చెందిన అనిల్ కుమార్(42) తాగుడుకు బానిసై భార్య లక్ష్మితో తరచుగా గొడువ పడుతుండేవాడు. ఈనెల 10వ తేదీన భార్యతో గొడవ పడి తల్లిదండ్రులు ఉంటున్న జ్యోతిర్గం ఆశ్రమానికి వెళ్లాడు. ఆదివారం మధ్యాహ్నం ఫిట్స్ రావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. తన భర్త మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని, మృతదేహానికి పంచనామ నిర్వహించి అప్పగించాలని మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

◆ విజేతలకు నగదు పురస్కారం



మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని మోతెలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా సర్పంచ్ కాలేరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో యువజన సంఘాలకు ఆదివారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. విన్నర్‌గా నిలిచిన భగత్‌సింగ్ యూత్‌కు రూ. 5 వేలు, రన్నర్‌గా నిలిచిన శ్రీరామ్ సేనకు రూ. 2500 నగదు పురస్కారం అందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నర్మెట మానస, వార్డు సభ్యులు రాజేశ్వర్, చంద్రం, రవికుమార్, నగేష్, భూపాల్, రమేష్, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.